కామెడీ కథ

# బొండయ్యా లవ్‌స్టోరీ

**కోలపల్లి ఈశ్వర్**

**“అతని పేరేమిటే? చాలా స్మార్ట్‌గా ఉన్నాడు” అంది ఒక అమ్మాయి ఐస్‌క్రీం చివరి స్పూన్‌ని కళ్లు మూసుకుని ‘ఉమ్చ్’ అంటూ మింగుతూ.**

**పక్కనున్న పోనీటైల్ కిసుక్కున నవ్వబోయి బావుండదనుకొని “అహ్హ హ్హాహ్హా” అంటూ నవ్వింది బావుంటుందేమోననుకొని.**

పాప్‌కార్న్ తింటున్న అమ్మాయి జడుసుకున్నట్టుగా స్టిల్ ఇచ్చి “ఆ నవ్వేంటే రాక్షసీ...అబ్బాయిలు భయపడి చచ్చేలాగా” అని కామెంట్ చేసి, తన కామెంట్ రియాక్షన్ కోసం పక్కనున్న అమ్మాయిల్ని చూసింది.

పాప్‌కార్న్ అమ్మాయిని తింగరి ఘటాన్ని చూసినట్టు ఎగాదిగా చూసి బబుల్‌గమ్ బుడగని ఊదింది మరో గాగుల్స్ అమ్మాయి.

స్మార్ట్‌గా ఉన్న ఆ అబ్బాయి తమని పిచ్చోళ్లని చూసినట్టుగా కూడా చూడకుండా వెళ్లిపోతుండడం చూసి బాగా ఇరిటేట్ అయిపోతూ.

“షిట్” అని అరిచింది మొదటి అమ్మాయి.

పోనీటైల్ ఆమెని డౌట్‌గా చూసి “ఎనీ ప్రాబ్లెమ్” అని అడిగింది నర్మగర్భంగా.

“స్టుపిడ్” అందా పిల్ల ఐస్‌క్రీం ఖాళీ డొక్కుని విసిరిపారేస్తూ.

“మరింకేంటి?” అంది పోనీటైల్ అర్థం కాక.

“వాడేంటే...టచ్‌మీనాట్‌లా అలా వెళ్లిపోతున్నాడు ఇంతమంది మిస్ యూనివర్స్‌లనొదిలిపెట్టీ?” అంది ఆ అమ్మాయి బాధగా.

“అదా నీ బాధ! వాడంతేనమ్మా. సుపీరియారిటీ కాంప్లెక్స్ ఎక్కువ వాడికి. అదో టైపు. వాడిని మొన్న కావాలని ఎదురుగా వెళ్లి డాషిచ్చినా సారీ చెప్పి షర్టు దులుపుకుంటూ వెళ్లాడే గానీ కించిత్ రెస్పాన్సు కూడా ఇవ్వలేదు” అంది పాప్‌కార్న్.

“ఇంతకీ వాడి పేరేంటే!” అంది మొదటి అమ్మాయి. ఈసారి బాగా డెస్పరేట్ అయిపోతూ.

“బొండయ్య” అంది పోనీటైల్ తాపీగా.

“వ్వాట్?” అదిరిపడిపోయింది ప్రశ్న వేసిన అమ్మాయి తన ఫ్రెండ్స్‌పై.

★ ★ ★

“వ్యాసరచన పోటీలో ఫస్ట్...వై.బొండయ్య” ఎనౌన్స్ చేశాడు ప్రిన్సిపాల్.

కరతాళధ్వనుల మధ్య వేదికపైకి వెళ్లి బహుమతి అందుకుంటున్న బొండయ్యని చూసి అంతా “హేయ్” అంటూ కేరింతలు కొట్టారు.

“సెకండ్ ప్రైజ్...స్నిగ్ధ.ఎస్”

ఈలలూ, గోలల మధ్య తన బహుమతిని అందుకుని స్టేజి దిగింది స్నిగ్ధ.

“హలో...”

“ఎస్” ఆగాడు వెనుదిరిగి బొండయ్య.

“కంగ్రాట్స్” అంది స్నిగ్ధ చేతిని ముందుకు చాచి.

“థాంక్స్” సుతిమెత్తని ఆమె చేతిని మాయాబజార్‌లో ఘటోత్కచుడిలా నొక్కేస్తూ నవ్వాడతను.

చేతిని నులుముకుంటూ నవ్వలేక నవ్వింది స్నిగ్ధ.

“అది కాదు...మీ పేరేంటి? అలా...బొండయ్య అనీ...”

“అదే నా పేరు” చెవుల్దాకా నవ్వుతూ “వరస్ట్‌గా ఉందా?” అని అడిగాడు.

“కదా మరి?” అంది స్నిగ్ధ సూటిగానే.

“భలే వారే! టెండూల్కర్, గోవిందా, బచ్చన్, నాయుడమ్మ...ఇవన్నీ పేర్లు కావా ఏంటి? వాళ్లంతా గొప్పవాళ్లు కాకపోతే, వాళ్ల పేర్లని విని మనం వింతగా ఫీలయ్యేవాళ్లం కాదా? చిరంజీవి, తరుణ్, పవన్...ఇలా నైస్‌గా ఉంటేనే పేర్లా? ఛార్లెస్ శోభరాజ్ అనే పేరు గ్లామరస్‌గా ఉంది. కానీ అతగాడు జైల్లో ఉన్నాడు. వీరప్పన్ అంటే హుందాగా ఉంది. అతడు దేశం మొత్తానికే తలనొప్పిగా మారిన అడవిదొంగ. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. తన గానమాధుర్యంతో యావత్ భారతదేశాన్ని ఓ ఊపు ఊపేస్తున్న గాయకుడి పేరు ఉదిత్‌నారాయణ. ఏమైనా బావుందా ఆ పేరు? అలాగే గవాస్కర్ అంటే ఇవ్వాళ మనకు ప్రపంచ ప్రఖ్యాత బ్యాట్స్‌మనే గుర్తుకు వస్తాడు గానీ ‘ఏంట్రా ఈ పేరు...అర్థంపర్థం లేకుండా’ అని అనుకోము గదా! అంతెందుకు...భారతదేశ సంగీత సంపదకు తలమానికమైన సంగీత సరస్వతి పేరు ఎమ్మెస్ సుబ్బులక్ష్మి. సుబ్బారావు, సుబ్బమ్మ అనే పేర్లని మనం ఎంత లైట్‌గా తీసుకుంటామో మీకు తెలియదా? పేరులో ఏముందండీ...మనిషి మనసు బావుండాలి గానీ.

మనిషి గొప్పవాడైతే అతని పేరూ అందంగా కనిపిస్తుంది. అందుకే నేను నా పేరుని ఎంతో ప్రేమిస్తాను. ఐ లవ్ మై నేమ్. మనిషికి పేరు సంపాదించడం ముఖ్యం గానీ అతని పేరు, దానికున్న అర్థం కాదు. ఏమంటారు?” అన్నాడు బొండయ్య.

చిన్నపిల్లలు చేతులు చాచి గిర్రున తిరిగే ఆట ఆడుతుంటారు. అలా బొంగరంలా తిరిగీ తిరిగీ ఒక్కసారిగా ఆగిపోతే కళ్లు ఎలా తిరుగుతాయో ఇప్పుడర్థమైంది స్నిగ్ధకు. బొండయ్య పేర్ల పురాణం విని ఆమెకి కళ్లే కాదు, బుర్ర కూడా గిర్రున తిరిగింది.

“ఏమండీ...అలా ఊగుతున్నారేం?” కంగారుగా అడుగుతున్న బొండయ్యను చూసి తనను తాను కంట్రోల్ చేసుకుంది స్నిగ్ధ.

“బావుందండి. కానీ ఇప్పుడంతా ఫ్యాషన్ ప్రపంచం కదా. మనం మన పేర్లని అందంగా మార్చుకుని పెట్టుకోవచ్చు. నోటరీ వద్దకు వెళ్లి మన పేరుని చట్టబద్ధంగా కూడా మార్చుకోవచ్చు” ఏదో చెప్పబోతున్న స్నిగ్ధని ఆగమని సైగ చేశాడు బొండయ్య.

“అంటే మీ ఉద్దేశ్యం?”

“అదేనండీ. సత్తిరాజు లక్ష్మీనారాయణ తన పేరుని మార్చుకుని ‘బాపు’ అయ్యాడు కదా. ఇప్పుడు ఎవరైనా అందమైన అమ్మాయిని చూస్తే మీరు బాపూ బొమ్మలా ఉందంటారు. సత్తిరాజు లక్ష్మీనారాయణ బొమ్మలా ఉందని అనాలంటే ఎంత ఇబ్బందిగా ఉంటుంది మీరే చెప్పండి” అంది స్నిగ్ధ.

కళ్లు చిట్లించి చూశాడు బొండయ్య. అదేం ఎక్స్‌ప్రెషనో అర్థం చేసుకోలేకపోయిన స్నిగ్ధ మళ్లీ కంటిన్యూ చేసింది.

“కిళాంబి నరసింహాచార్యులు ఆత్రేయగా, ఉప్పు శోభనాచలపతిరావు శోభన్‌బాబుగా, ఘట్టమనేని శివరామకృష్ణ కృష్ణగా, అంతెందుకు దుర్గాప్రసాద్ చిరంజీవిగా...తమ తమ పేర్లను అందంగా మార్చుకోలేదూ? ఇలా చెప్పుకుంటూ పోతే జయసుధ, జయప్రద, రంభ...ఇంకా ఇంకా ఎందరో ఉన్నారు గదండీ” రొప్పుతూ అంది స్నిగ్ధ.

బొండయ్య నవ్వాడు.

“మీకు జనరల్ నాలెడ్జ్ ఎక్కువే అని నాకర్థమైందండీ. ఎవరెవరి అసలు పేర్లేమిటో మీకు బాగానే తెలుసు. అవన్నీ పెట్టుడు పేర్లే కదా. ఎంత గొప్ప పేరు పెట్టు




కున్నా మొహానికి ఏదో మాస్క్ తగిలించుకున్నట్టే ఉంటుంది కానీ సహజమైన ఫీలింగ్ ఉంటుందా? పేరెంత అసహ్యంగా ఉన్నా ఎవరి పేరు వారికిష్టం. ఒరిజనల్ పేరులో ఉన్న తీయదనం పెట్టుకున్న పేరులో ఉండదండి. అందుకే ఐ లవ్ మై నేమ్."

తివిరి ఇసుమున తైలంబు...అనే పద్యం గుర్తుకొచ్చింది స్నిగ్ధకి. మూర్ఖుడి మనసు మార్చడం ఎవడి తరంరా బాబూ అనుకుంటూ వాచీ చూసుకుంది. ఓహ్! తొమ్మిది. ఫంక్షన్ ఇప్పుడప్పుడే అయిపోయేలా లేదు గానీ త్వరగా ఇంటికెళ్లాలనుకుంటూ..

"సరేనండి.. మరి నేవస్తానూ" అని స్నిగ్ధ అంటుంటే "అప్పుడే వెళ్లిపోతారా?" అన్నాడు బొందయ్య.

"అవునండీ...చీకటి పడిపోయిందిగా. అసలే మా ఏరియాలో బొందలెక్కువ. వస్తానండీ బొందయ్యగారూ" అంటూ వడివడిగా అక్కడ నుంచి వెళ్లిపోయింది స్నిగ్ధ.

* * *

ప్రేమకి కులం, భాష, ప్రాంతం, అంతస్థు ఇవేవీ అడ్డ రానట్టుగా, పేరు కూడా అడ్డురాదని వీళ్లిద్దర్నీ చూశాకే కొంతమందికర్థమైంది.

సాహిత్యంపై ఉన్న ఆసక్తి కొద్దీ స్నిగ్ధ, బొందయ్య ఇద్దరూ తరచూ లైబ్రరీలో కలుసుకోవడం, సాహితీ కార్యక్రమాలకు వెళ్లడం ద్వారా బాగా దగ్గరయ్యారు.

కానీ స్నిగ్ధకి ఒక్కటే బాధ. స్నిగ్ధ బాధని పట్టించుకోకుండా పుండుమీద కారం చల్లినట్టుగా ఆమె ఫ్రెండ్స్ కూడా మరింత బాధ పెడుతున్నారు.

అదే...తన ప్రేమికుడి పేరు.

పలకడానికే అసహ్యంగా ఉన్న ఆ దరిద్రపుగొట్టు పేరు...

ఏం చేసేది! పేరు మార్చుకోమంటే అతను వినడు గదా ఫిలాసఫీ చెబుతాడు.

పేరులో ఏముంది ప్రియా? అదే మాట.

కాలం ఎవరికోసం ఆగుతుంది గనక!

రోజులు గడుస్తూనే ఉన్నాయి. స్నిగ్ధ తన ప్రేమికుడ్ని నోరారా పిలవలేదు. తోచనప్పుడు, తోచినప్పుడు తన చూపుడు వేలితో నేలమీదో, టేబుల్‌మీదో 'స్నిగ్ధ అండ్ బొందయ్య' అని రాయలేదు కాబట్టి ఒక ఉపాయం కనుక్కుంది.

బొందయ్యని పేరు పెట్టి పిలిచేంత ఎమర్జెన్సీ ఏర్పడితే వై.బి. అంటుంది షార్ట్‌కట్‌గా. అలా తనను తాను సమాధానపరచుకుంది స్నిగ్ధ.

ఏమిటో ఈ దేవుడు! అన్నీ సవ్యంగా ఇచ్చి పేర్లు మాత్రం అడ్డదిడ్డంగా పెడతాడు..అని ఎన్నోసార్లు తనలో తాను కుమిలిపోయేది స్నిగ్ధ. కానీ పేర్లు పెట్టేది దేవుడు కాదనీ, కన్నవాళ్లేననీ ఆ అమాయకురాలికి ఎవరు ఎక్స్‌ప్లెయిన్ చేయాలి!

స్నిగ్ధ అతన్ని మనసారా ప్రేమిస్తున్న మాటే గానీ ఈ ప్రేమ ప్రయాణంలో ఆమె ఎన్ని దెబ్బలు తిన్నదీ ఆమె హృదయానికి మాత్రమే తెలుసు.

స్నిగ్ధ ఓసారి బొందయ్యతో కలసి సంగీత్‌లో సినిమాకి వెళ్లింది. అక్కడ ఫుల్ రష్. అంతా క్లాస్ పీపుల్. టిక్కెట్లు తీసుకుని హాల్లోకి వెళ్లబోతుంటే వెనుక గుంపులో నుండి ఎవరో "బొందా...ఒరేయ్ బొందా" అని డీటీఎస్ సౌండ్ సిస్టంలో పిలిచారు. అందరూ బొందయ్యని ఒక గ్రహాంతర వాసిలాగా వింతగా చూస్తూ ఫకఫకా నవ్వుతుంటే

తనకెంత తలవొంపులై పోయిందనీ!

పెద్ద ఖడ్గంతో తన తలని కేరట్ ముక్కలా కోసేసినట్ల యింది. ఇంక సినిమా ఏం చూస్తుంది! వెంటనే భోరున విలపిస్తూ కర్చీఫ్‌ని మొహానికి అడ్డం పెట్టుకుని అక్కడ నుంచి పరుగెత్తుకొని వచ్చేసింది.

మరోసారి గుడికెళ్లినప్పుడు...పండగ కదాని తమ పేర్ల మీద అర్చన చేయిస్తుంటే పూజారి అతని పేరు విని ఎలా నవ్వాడనీ! దేవాలయం కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే ఏం చేసి ఉండేదో ఆమెకి ఐడియాయే రాలేదు.

ఎవరైనా ఒక అమ్మాయి ప్రేమలో పడటం తప్పు కాదు. కానీ పదిమందికీ వింటేనే భళ్లున నవ్వు తెప్పించే పేరున్న వాడితో ప్రేమలో పడటమే అత్యంత దురదృష్ట కరం అని స్నిగ్ధ గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు.

స్నిగ్ధకి అనుకోకుండా మంచి సంబంధం వచ్చింది. చదువుదేముంది. తరువాతైనా చదువుకోవచ్చునుకున్న




ఆమె తల్లిదండ్రులు, పెళ్లి విషయం కదిపారు.

"అయ్యయ్యో...నేనొక అబ్బాయికి మనసిచ్చానే" అంది స్నిగ్ధ అయోమయంగా, కంగారుగా.

"అన్నీ ఇట్లాంటి అవకతవక పనులే చేస్తుంటావు గదా! ఇస్తే ఇచ్చావుగానీ తిరిగి తీసుకో" అన్నారు వాళ్లు అనునయంగా.

"పారేసిన యూజ్ అండ్ త్రో గ్లాసుని మళ్లీ వెనక్కి తీసుకోగలమా?" అంది స్నిగ్ధ ఎంతో భావగర్భితంగా. కానీ అదొక దిక్కుమాలిన పోలిక అనీ, దానికి వ్యతిరే కార్థం వస్తుందనీ ఆమె తెలుసుకునే స్థితిలో లేదు.

ఎంతైనా స్నిగ్ధని కన్నవాళ్లు కదా వాళ్లు! ఆమె కంటే ఎంతో తెలివిగల వాళ్లు.

"యూజ్ అండ్ త్రో గ్లాసుని ఎక్కడబడితే అక్కడ పారేయడం వల్లనే పొల్యూషన్ ఇట్లా పెరిగిపోయి, ఓజోన్ పొరకు తూటు పడింది" అన్నాడు స్నిగ్ధ తండ్రి బేస్ వాయిస్‌లో, ఆరితేరిన సినిమా హీరోయిన్ తండ్రిలా.

"అయినా చక్కగా ఇంట్లో స్టీలుగ్లాసులో ఫిల్టర్ కాఫీ తాగాలి గానీ కేంటిన్లలో చేసే చవకబారు టీలు తాగడం పద్ధతి కాదమ్మా" అంది స్నిగ్ధ తల్లి వెనకటి సినిమాలో పండరీబాయి టైపులో.

ఒక దిక్కుమాలిన ఛండాలపు దరిద్ర ఉపమానం వాడినందుకు తగిన శిక్షే తనకు లభించిందని పశ్చాత్తాప పడిన స్నిగ్ధ, చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి ఉద్యు క్తురాలైంది.

"అపార్థాల్లో కూరుకుపోతే మన కథ పేజీలు దాటి కేజీ లవుతుందిగానీ నేను చెప్పేది వినండి. నేను ఒక అబ్బా యిని ప్రేమించాను. అతను అన్ని విధాలా యోగ్యుడు అని మీకనిపిస్తే, ఎవడో కోన్‌కిస్కాగాడికి నన్ను కట్టబె ట్టడం కంటే ఈ కోన్‌కిస్కాగాడికితోనే నా పెళ్లి జరిపిం చడం మంచిది" అని వెంటనే తల మీద ఒక్కటి చర చుకొంది స్నిగ్ధ. తన ప్రియుణ్ని తానే కోన్‌కిస్కాగాడని ఎలా అనగలిగిందో ఆమెకి అసలు అంతుబట్టలేదు.

అయితే ఎంతో సహృదయులూ, అవగాహనాప రులూ అయిన స్నిగ్ధ తల్లిదండ్రులు ఆమె భాషాదోషా లను, అపసవ్య పదప్రయోగాలనీ పట్టించుకోకుండా..

"ఇంతకీ ఆ అబ్బాయి పేరేమిటమ్మా?" అని మాత్రం అడిగారు సంయుక్తంగా.

"బొందయ్య" సందర్భోచితంగా సిగ్గుపడుతూ పలి కింది స్నిగ్ధ.

అలాంటి పేరుని పలకలేక సిగ్గుపడుతోందో, ప్రియుని పేరుని తన నోటితో చెప్పలేక సిగ్గు పడు తుందో ఆ అమాయక తల్లిదండ్రులకు అర్థం కాలేదు. అయినా సరే, విశాల హృదయులు కావడం చేత అదంతా పక్కనబెట్టారు.

"అమ్మా స్నిగ్ధా! మనిషి ముఖం చూస్తే అతని గుణగ ణాలని చెప్పవచ్చు. ముఖమే తెలియని మనిషి పేరుని బట్టి అతని ముఖాన్ని ఊహించవచ్చు. ఇప్పుడు నువ్వు చెబుతున్న పేరుని బట్టి నీ సెలక్షన్ మరీ ఇంత దరి ద్రంగా ఏడ్చినందుకు మాకు ఏడుపొస్తోంది" అన్నాడు స్నిగ్ధ తండ్రి కర్చీఫ్ వెదుక్కుంటూ.

అనవసరంగా తను మరో పొరపాటు చేసిందే! ఛీ! తనకు ప్రేమ విషయాలు మాట్లాడ్డం రాదు అని తిట్టు కుంది స్నిగ్ధ. అయినా ఇదే ఫస్ట్ టైం కదా, ఇలాంటి పొర పాట్లు దొర్లక తప్పవని తనను తాను సమర్థించుకుంది.

"పేరులో ఏముందమ్మా? మీరతన్ని ముందు చూడండి. మీకతను తప్పక నచ్చుతాడు. నచ్చకపోతే నా పేరుని తీసి మారుపేరు పెట్టండి."

ఎంతో ఆత్మవిశ్వాసంగా బల్లగుద్ది చెప్పాలనుకుంది స్నిగ్ధ. కానీ అక్కడ టేబుల్ లేకపోవడం చేత సోఫానే గుద్ది చెప్పింది.

అప్పుడు స్నిగ్ధ తండ్రి సాత్వికుడైన సినీ హీరోయిన్ తండ్రిలా చిరునవ్వు నవ్వి-

"అంత అవసరం లేదమ్మా. జస్ట్...అతని పేరు మార్చితే చాలు" అన్నాడు.

అక్కడితో ఒక సీన్ ముగిసింది.

* * *

"ప్రేమ కోసం ఎన్నెన్నో త్యాగాలు చేసిన వాళ్లున్నారు. ఆఫ్టరాల్ మన ప్రేమ ఫలించడానికి ఈ ఒక్క త్యాగం చేయలేవా వై.బీ?" అతని ఒడిలో తలపెట్టి గోముగా అడిగింది స్నిగ్ధ.

అతడు ఆమె చుబుకాన్ని సుతారంగా స్పృశిస్తూనే అన్నాడు స్థిరంగా.

"ఇంకేదైనా అడుగు. నేను త్యాగం చేస్తాను. నా కన్న వాళ్లనీ, ఆస్తిపాస్తుల్నీ, నా చొక్కానీ, నా ప్యాంటునీ...ఇంకా.."

చప్పున అతని నోరు మూస్తూ అంది స్నిగ్ధ-

"అవన్నీ నేనడిగానా? కేవలం నీ పేరుని మాత్రమే కదా. నేను త్యాగం చేయమనీ...ఐ మీన్...మార్చుకోమని అడిగిందీ" మరింత జాలిగా, అతని కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగింది స్నిగ్ధ.

"కుదరదు స్నిగ్ధా"

"నా కంటే ఆ బోడి పేరే ముఖ్యమా?"

"నువ్వేమైనా అనుకో కానీ నా పేరును మార్చుకో వడం మాత్రం కుదరదు స్నిగ్ధా"

"ఏం?"

"మరో పేరు పెట్టుకుంటే నన్ను పిలిచినట్లుగా అని పించదు"

"అలాగా" అంది స్నిగ్ధ సాలోచనగా.

అప్పుడే ఆ దారి వెంట వెళుతున్న ఓ వ్యక్తిని చూసింది స్నిగ్ధ.

"ఓయ్ గుండూ!" అని పిలిచింది. అతను వెళ్తున్న వాడల్లా ఆగి గిరుక్కున వెనక్కి తిరిగాడు ఏమిటన్న ట్లుగా.

"చూశావా? అతని పేరు గుండు కాదు. అయినా గుండూ అంటే తననే పిలిచానని అర్థం చేసుకున్నాడు. అలాగే పొట్టి, పొడుగు, బాబూ, బ్రదర్, బాసూ, గురూ,

హలో, చిన్నా, కన్నా, బుజ్జీ, పండూ...ఇవన్నీ పేర్లేగా. కాబట్టి ఒకసారి అలవాటు చేసుకుంటే చాలు. ఆ పేరునే మన పేరు అనుకుంటాం." చెప్పింది స్నిగ్ధ. తన తెలివికి తానే ముచ్చటపడుతూ.

"అవునవును...ఒరే, ఒసే, నిన్నే, ష్ష్...ఇలా పిలిచినా పలుకుతారు. కానీ ఇవి ఒక పర్టికులర్ పర్సన్‌కి పనికొచ్చేవి కాదుగా. ఈ పేర్లతో ఎవర్ని పిలిచినా రెస్పాన్స్ ఒకటే ఉంటుంది. అంచేత నా పేరుని మార్చుకోకూడదనే నా నిర్ణయాన్ని నువ్వు మార్చలేవు" మొండిగా అన్నాడు బొందయ్య ఆకాశంలోకి చూస్తూ.

'నీ తల రాతను కూడా మార్చలేను. నా తల రాతని అంతకన్నా మార్చలేను' అని మనసులో అనుకున్నాక ఎందుకో గానీ ఆమెకి ఈ జీవితం మీద అంతులేని విరక్తి కలిగింది.

"నువ్వు నా మాట వినవని అర్థమైపోయింది. ఇంక నేను బ్రతకడం వ్యర్థం" అని సడెన్‌గా లేచి అక్కడ నుంచి పరుగెత్తబోతున్న స్నిగ్ధని చూసి, అనుకోని ఈ పరిణామానికి బిత్తరపోయాడు బొందయ్య.

పది గజాలు పరుగెత్తిందో లేదో వెనుక నుంచి చప్పట్లు వినిపించాయి.

స్నిగ్ధ మనసు హర్షాతిరేకంతో ఉప్పొంగిపోయింది. తన అస్త్రం పనిచేసింది. తను ఆత్మహత్య చేసుకొంటానంటే భయపడి మనసు మార్చేసుకున్న తన ప్రియుడు తనని పిలుస్తున్నాడు అనుకుంటూ నవ్వుతూ వెనక్కి తిరిగింది. అదే క్షణంలో ఆమె నవ్వు మాయమై, దాని స్థానంలో తీవ్రమైన కోపం చోటుచేసుకుంది.

చప్పట్లు కొట్టి తనని పిలిచింది బొందయ్య కాదు ఆ గుండు మనిషి.

'నేను వెళ్లిపోవాలా?' అని తన సౌంజ్ఞలతో అడుగుతున్నాడు స్నిగ్ధని. పిచ్చెక్కిపోయిన స్నిగ్ధ పక్కనే ఉన్న చిన్న రాయిని అందుకుని వాడికేసి బలంగా విసిరి, మళ్లీ పరుగు ప్రారంభించింది రోడ్డుకడ్డం పడి.

"స్నిగ్ధా...ఆగు...ఆగు.." అంటూ పరుగెత్తుకొస్తున్న బొందయ్యని చూసి మరింత అడ్డదిడ్డంగా పరుగెత్తసాగింది స్నిగ్ధ...గుడ్డెద్దు ట్రాఫిక్‌లో పడ్డట్టుగా.

అంతలో వెనుక పెద్ద చప్పుడు. ఖీంకరిస్తూ బ్రేకుల శబ్దాలు..ఒక్కసారిగా ఆగిపోయిన వాహనాలు... కేకలు వేస్తూ జనం ఉరుకులు పరుగులు.

ఆగి చూసింది స్నిగ్ధ.

ఏక్సిడెంట్.

తన ప్రియుడు బొందయ్యని ఆటోరిక్షా గుద్దేసింది.

* * *

ఎంతో కష్టం మీద కళ్లు తెరచిన బొందయ్యకి కొన్ని క్షణాల దాకా ఏమీ అర్థం కాలేదు. కారణం అతనిప్పుడు ఏదో హాస్పిటల్లో ఉన్నాడు. అక్కడి తెల్ల ఇనుప బెడ్లు, ఆకుపచ్చ కర్టెన్లు, మందుల వాసనని బట్టి ఆ విషయం గ్రహించిన బొందయ్య జరిగినదంతా ఫ్రేములు ఫ్రేములుగా గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

అంతలోనే అతనికి పక్క బెడ్‌పై నుండి ఎవరో ఏదో పాడుతున్నట్టుగా తోచింది. ఒక్కసారి చెవులు రిక్కించి వినడానికి ప్రయత్నం చేశాడు. చెవులకి ఏదో అడ్డుగా ఉందనుకుని చేత్తో తడిమి చూశాడు. అతని తలకి బలమైన పెద్ద బ్యాండేజీ ఉందని అర్థమైంది. కొద్దిగా చెవుల దగ్గర పట్టీలను తొలగించేసరికి పక్క బెడ్‌లో మనిషి పాట స్పష్టంగా వినిపించసాగింది. అయితే అది పాట కాదనీ, కవిత అనీ గ్రహించడానికి అతనికట్టే సేపు పట్టలేదు.

'పేరులోనే ఉందా పెన్నిధి?

పేరుకుపోయిందేనా నిధి?

పుట్టకముందు ఏదిరా నీ పేరు?

పట్టుకుపోతావా నీతో నీ పేరు?

నీటికేదీ పేరు? పైట గాలికేదీ పేరు?

గాలిపాటకేదీ పేరు, గండుచీమకేదీ పేరు?'

వెంటనే దిక్కులు పిక్కటిల్లేలా ఒక్క గావుకేక పెట్టాలనుకున్నాడు బొందయ్య. కానీ గొంతు చుట్టూ కూడా బ్యాండేజీ ఉన్నందున అది వీలుకాక గావుకేకని ఒక భారీ నిట్టూర్పుగా మార్చుకున్నాడు. అలా ఆ కవితాగానం వింటూవింటూ పిచ్చిచూపులు చూడ్డం అలవాటు చేసుకున్నాడు. అలా పిచ్చిపిచ్చిగా చూస్తూనే నిదురలోకి జారుకున్నాడు.

* * *

బెడ్‌లో నుంచి కదలలేకపోతున్న బొందయ్యకి అన్ని సేవలూ సక్రమంగానే జరుగుతున్నాయి. కానీ అతడేమీ మాట్లాడలేకపోతున్నాడు. నిరంతరం అతనికి పక్క బెడ్ నుండి కవితాగానం వినిపిస్తూనే ఉంది. బ్యాండేజీ ఆ కవితా గాన మకరందాన్ని తన కర్ణపుటాలకి చేరకుండా ఆపలేకపోతోంది.

ఇది చాలదన్నట్టుగా ఎదురుగా టీవీ. కవితాగానం ఆగిపోయినప్పుడల్లా టీవీలో సీరియళ్లు చూడాల్సి వస్తోంది. టీవీ ఆపమని నర్సుకి చెబుదామనుకుంటే ఆవిడ అర్థం చేసుకోలేదు సరికదా డోంట్ వర్రీ అన్నట్టుగా నవ్వుకుంటూ వెళ్లిపోతోంది.

కళ్లు తెరిస్తే ప్రేమ, పెళ్లి, అక్రమసంబంధాలు, పెంపుడు కొడుకులు, ఓటమి, విజయం, కుటుంబాలు, కలతలు, అపార్థాలు, కన్నీళ్లు...ఇవే గొడవలతో ఏవేవో సీరియళ్లు. కళ్లు మూస్తే రకరకాల పద ప్రయోగాలతో రాళ్లమీద, గోళ్లమీదా, పళ్లమీదా, కుళ్లమీదా...అన్ని అంశాల మీదా ఏవేవో సుదీర్ఘ కవితలు...ఇదే ప్రపంచం అయిపోయింది బొందయ్యకు.

ఇలా ఎంతకాలం గడిచిందో తెలియదు.

ఒకరోజు పక్కనే స్నిగ్ధ కనిపించింది. పట్టరాని ఆనందంతో అతని పెదవులు విచ్చుకున్నాయి.

"స్...స్...స్..." అన్నాడు.

తన ప్రేమికుడి మూగ హృదయ ఘోషకు విలవిల్లాడిపోతూ రెండు కన్నీటిబొట్లు టప్‌టప్‌మని రాల్చింది స్నిగ్ధ.

"ఏమిటి వై.బీ.?" అంది ఆనందాశ్రువులు రాలుస్తూ.

"పేరు.." అన్నాడు తడబడుతున్న పెదాలతో.

"నా పేరా...? స్నిగ్ధ!" అంది పిచ్చిగా చూస్తూ.

"కాదు" అన్నట్టుగా తల అడ్డంగా ఊపి తన పేరు అన్నట్టుగా తలని మరోలా ఊపాడు.

"నీ పేరా? బొం..."

ఈసారి ఓవర్‌స్పీడుగా తల అటూ ఇటూ గిలగిలా కొట్టుకుంటున్నట్టు కదిల్చి "ఉ ఉ ఊ" అన్నాడు.

ఇదేం భాషో అర్థం కాని స్నిగ్ధకి ఒక అద్భుతమైన ఐడియా వచ్చింది. వెంటనే పక్కనున్న ప్యాడు, పెన్నూ అందుకుని అతని చేతికి ఇచ్చింది.

అతడు పేపర్‌పై రాశాడు.

వై.బిఓఎన్‌డిఏఐఏహెచ్...వెంటనే చివరి నాలుగు అక్షరాల్నీ కొట్టేశాడు మళ్లీ.

వై. బాండ్...

జేమ్స్‌బాండ్ టైపులో అన్నమాట!

స్నిగ్ధకి అతని భావన అర్థమైంది. చింత చచ్చినా పులుపు చావలేదనుకుంది మనసులో. పోనీలే సగం దారికి వచ్చాడు. మరోవారం రోజులు తను అరేంజ్ చేసిన కవితాగానం, టీవీ సీరియళ్ల ప్రదర్శనని కంటిన్యూ చేస్తే సరి! అయ్యగారి పిప్పి వదలిపోయి, మిగతా సగం కూడా దారికొస్తాడు అనుకుని గుంభనంగా నవ్వుకుంది.

"మైడియర్ బాండ్...ఇప్పటికి సగం కోలుకున్నావు. త్వరలోనే పూర్తిగా కోలుకుంటావులే" అంది ఆప్యాయంగా అతని చేతిని ముద్దు పెట్టుకుంటూ.

కర్టెన్ వెనుక నుంచి ఇదంతా గమనిస్తూ నవ్వుకుంటున్న స్నిగ్ధ అక్క, బావలే అక్కడ డాక్టర్లని బొందయ్య...సారీ... ప్రస్తుత బాండ్ గారికేం తెలుసు పాపం!!!

